

# శ్రవణభక్తి - కీర్తనభక్తి

ఉపన్యాసకులు

డా॥మారెళ్ళ శ్రీరామకృష్ణ గురుదేవులు

స్థలం : గీతామందిరము; తా॥ 12-2-2004






మిషన్ ఆర్.కె. సర్వసమర్పణ

# శ్రవణభక్తి-కీర్తనభక్తి


శ్రవణభక్తి-కీర్తనభక్తి

ప్రథమ ముద్రణ : 500

శ్రావణ పూర్ణిమ, 2004

మూల్యం : రూపాయిలు

డి.టి.పి. ---- శ్రీమతి లక్ష్మిగోపాల్,

ప్రతులకు : మిషన్ ఆర్.కె. హైదరాబాద్. ఫోన్ నెం. 040/3834474

అపూర్వా పబ్లికేషన్స్, ఒంగోలు. ఫోన్ నెం. 08692/23971



# ముందుమాట

నేడు ఎటు చూసినా ప్రపంచము ఒక అశాంతస్థితిలో ఉంది. మనిషి మనుగడకు కావల్సిన తలుపులన్నీ ఒకదాని తర్వాత ఒకటి మూసుకునిపోతున్నాయి. మనిషికి-తోటి మనిషి మీద విశ్వాసం లేదు, నమ్మకం లేదు. 'నేను- నా కుటుంబం' అన్న స్వార్థముతప్ప ప్రక్కవాడి గురించి ఆలోచించటమే లేదు. మనిషి ఈ దౌర్భాగ్య మానసికస్థితితో పాటు అటు ప్రకృతి కూడా తోడైంది. అకాల వర్షాలు, భూకంపాలు, యుద్ధాలు, తుఫానులు.... మనిషి జీవితాన్ని ఛిన్నాభిన్నము చేస్తున్నాయి. మనిషి మనుగడే ఒక ప్రశ్నగా మారింది. మనిషి మీద మనిషికే నమ్మకము లేకపోతే ఇంక భగవంతుడి మీద యేమి నమ్మకము వుంటుంది?

ఎడారి లాంటి ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడి మనిషి - మనిషిగా, మనీషిగా హాయిగా, ఆనందంగా, శాంతిగా, సంపదలు కలిగి, సుఖంగా జీవించాలంటే ఒయాసిస్సు లాంటి ఒక వరము అతని జీవితములోకి ప్రవేశించాలి. అది మనిషి మనస్సుకు శాంతి-శరీరానికి సుఖము కలిగిస్తుంది.



అయితే ఈ మార్పు మనిషి జీవితంలో రావటానికి ముందు అసలు ఈ భయంకర పరిస్థితులను ఎవరు నిర్మించారు? ఈ అశాంతికి కారణం ఎవరు? అన్న ప్రశ్న వేసుకుంటే దానికి జవాబుగా 'మనిషి' అని ప్రకృతి సమాధానమిస్తుంది. మనిషి తప్ప మిగతా ఏ ప్రాణి దీనికి కారణం కాదు. మరి ఇలాంటి అశాంతిపూరిత వాతావరణం పోయి మళ్ళీ మనిషి జీవితంలోకి మలయమారుతం సుగంధభరితముతో పాటు వీచి అతని మనస్సుకి, ప్రకృతి వాతావరణానికి హాయిని, శాంతిని కలిగించాలంటే మనిషి ఏం చేయాలి?

"మనిషి ఇప్పటి తన జీవిత విధానాన్ని, ఆలోచనలను మార్చుకోవాలి" అనే జవాబు వస్తుంది.మార్చుకుంటే భూమే స్వర్గంగా మారదా!! హిమాలయాల చల్లదనం మనస్సుని ఆవరించదా!!

అలా రావాలంటే ఏం చెయ్యాలి? అనేదాన్ని అనేకమంది గురువులు, మహానుభావులు చెపుతూనే ఉన్నారు. వాళ్ళు చెప్పింది ఈ చెవితో విని, ఆ చెవితో వదిలెయ్యకుండా వాళ్ళు చెప్పింది నిత్యజీవితములో అమలులో పెట్టినట్లయితే, మనిషి స్వర్గంలో వున్నట్లు జీవించవచ్చు. అలా ముందు వాళ్ళు చెప్పింది వినటము అలవాటు చేసుకుంటే వినగావినగా మెల్లిగా ఆ తర్వాత దాన్ని ఆచరించటము అనేది అదే వస్తుంది. ఇలా చేయటమే శ్రవణభక్తి.

దీనిద్వారా మీ జీవితములో మార్పులొస్తాయి. అప్పుడు మీరు ఇదివరకులాగ కాకుండా ఎలాంటి పరిస్థితులున్నా నవ్వుతూ, ఆనందంగా, సుఖంగా, సంతోషంగా జీవిస్తారు. మీ జీవితములో వచ్చిన ఈ మార్పును సమాజము గుర్తిస్తుంది. గుర్తించటమే కాదు; మనిషికున్న సహజమైన కుతూహలంతో మనుష్యులు "నువ్వు ఎలాంటి పరిస్థితులున్నా ఇంతానందంగా ఎలా జీవించ గల్గుతున్నావు?" అని అడుగుతారు. మీరు మీ జీవితంలో ఆ మార్పు ఎలా



వచ్చింది? అనేది వారికి వివరిస్తారు. వారు దాన్ని అనుసరించి ఆనందాన్ని పొందుతారు. ఇలా చేయటమే కీర్తనభక్తి.

ఇలా మీ జీవితాలలో గొప్పవాళ్ళు చెప్పింది వినటము, విన్న దాన్ని ఆచరించటము, దాన్ని ఇతరులకి చెప్పటం ద్వారా మీరు తరించటమే కాక లోకకళ్యాణం కూడా జరుగుతుంది. ఈ వినటం- చెప్పటం అనే వాటినే భాగవతములో --

''శ్రవణభక్తి - కీర్తనభక్తి''

లుగా వ్యాసభగవానుడు అందించాడు. భగవంతుని గుణమును ఇలా విని, కీర్తించి తరించుదాము..

నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై<br>
జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వు రా<br>
జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దెచ్చె నో<br>
మల్లియలార! మీ పొదలమాటున లేడు గదమ్మ! చెప్పరే ॥

కాబట్టి ఆయన చెప్పింది శ్రవణం చేసి, కీర్తించి ఆయన లానే మనమూ తరిద్దాము. అందరిని తరింపజేద్దాము.

ఇట్లు

శ్రీమతి లక్కరాజు. లక్ష్మిగోపాల్ (గాయత్రి హిమగిరిపీఠం)



# శ్రవణం – కీర్తనం

## పరీక్షిన్మహారాజు భాగవత సప్తాహ శ్రవణంతో అమరత్వాన్ని పొందిన వైనం

పరీక్షిన్మహారాజు పాండుమధ్యముడైన అర్జునుడి యొక్క మనుమడు. ఇతను చాలా శక్తిమంతుడు. ధార్మికుడు. అంతేకాక కలియుగాన్ని 36 సంవత్సరాలు రాకుండా ఆపగలిగిన ప్రజ్ఞాశాలి. కలిపురుషునికి ఇతన్ని చూస్తే భయము. అందుకే కలిపురుషుడు అతనికి దూరంగా ఉండేవాడు. ఒకసారి పరీక్షిన్మహారాజు వేటాడటం కోసం అడవికి వెళ్ళి వేటాడుతూ వేటాడుతూ అడవిలో తన సైనికుల నుంచి దూరంగా



వెళ్ళిపోయాడు. అతనికి విపరీతమైన దాహము వేసింది. దగ్గరలో శమీకమహర్షి యొక్క ఆశ్రమము కనిపిస్తే దాహము తీర్చుకునేందుకు ఆశ్రమానికి వెడతాడు.

అయితే ఆ సమయములో శమీకమహర్షి సమాధినిష్టుడై ఉండటము వలన మహారాజు యొక్క రాకను గమనించలేదు. ఇది చూసిన మహారాజుకి 'రాజు నైన నన్ను చూసికూడా ఒక ఋషి అందునా తన ధనముతో ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నవాడు లేచి తనకి నమస్కరించ లేదు' అనే అహంకారము ప్రవేశించింది. రెండుసార్లు పిలిచాడు. అయినా ఆయన సమాధానం చెప్పలేదు. ఆ ఋషి నిజంగానే సమాధిస్థితుడై వుండటం వలన బదులు చెప్పలేదు. వెంటనే అక్కడ చనిపోయి పడున్న ఒక పాము యొక్క శరీరాన్ని ఆ మహర్షి మెడలో వేస్తాడు.అయినా ఋషి చలించలేదు. రాజుకి వెంటనే తను చేసిన తప్పు పనికి సిగ్గువేసింది. వెంటనే అక్కడినుంచి వెళ్ళిపోతాడు. ఈ విషయం నది దగ్గర తన తోటి బాలురతో ఆడుకుంటున్న శమీకఋషి కుమారుడైన శృంగిఋషికి



విద్య యొక్క లక్ష్యము ఆత్మవిశ్వాసమును,
చిత్తశుద్ధిని, పూర్ణహృదయమును
సాధించుట. ఉత్తమశీలము, సద్భలము,
పరోపకారము వికసించే వ్యక్తిత్వము
పొందుట. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువల
సమ్మిళిత తత్త్వమే నిజమైన విద్య.



తెల్సింది. అతను వెంటనే కోపంతో ‘ నా తండ్రి మెడలో పామును వేసిన వ్యక్తి ఏడు రోజుల లోపల తక్షకుడు అనే పాము కాటుకి గురై చనిపోవుగాక’ అని శపించాడు. ఆ కోపస్థితిలోనే తండ్రి దగ్గరికి వస్తాడు. ఇంతలో శమీక మహర్షి సమాధి నుంచి బయటికి వచ్చి, జరిగిన విషయం తెల్సుకుని రాజును తల్చుకుని బాధపడి తన కుమారుణ్ణి తీవ్రంగా మందలిస్తాడు.




పరీక్షిత్తుకి ఈ శాపం విషయం తర్వాత తెలుపుతారు. అతను వెంటనే తన రాజ్యాన్ని తన కుమారునికి అప్పజెప్పి, సన్యాసాశ్రమం స్వీకరించి ధార్మిక జీవితాన్ని గడపటానికి నిర్ణయించుకుంటాడు. అప్పుడు అతని రాజపురోహితులు శుకమహర్షి చేత భాగవత సప్తాహ పారాయణ చేయించుకుని తరించమని హితబోధ చేశారు. రాజు శుకమహర్షికి విషయం తెల్పి తనకి భాగవత సప్తాహాన్ని వినిపించమని ప్రార్థిస్తాడు. అప్పుడు శుకమహర్షి ఆయనకి అమరత్వాన్ని ప్రసాదించే భాగవత సప్తాహాన్ని వినిపిస్తాడు. దానితో పరీక్షిన్మహారాజు ఏడవ రోజున అమరత్వాన్ని పొందుతాడు.

కలియుగాన్ని 36 సంవత్సరాలు భూమిమీదకి రాకుండా ఆపగల్గిన మహారాజుకి అమరత్వాన్ని ప్రసాదించిన భాగవతములో ఏముంది? అది అమరత్వాన్ని ఎలా



ప్రసాదించింది? అనే ప్రశ్న వేసుకుంటే -భాగవతం భగవానుడు శ్రీకృష్ణుని దివ్యలీలలను వినిపించే అమృతగాథ కనుక, ఆయన ఏ జీవిత విధానాన్ని అనుసరించాడో సాధకుడు కూడా ఆ జీవితవిధానాన్ని అనుసరించినప్పుడు అమరత్వమును పొందవచ్చు. ఈ అమృతగాథను ఎవరైతే వింటారో వారిని చూసి మృత్యువు భయపడుతుంది. దేవతలు వారి ముందుర వరాలు ఇవ్వటానికి చేతులు కట్టుకుని నిలబడతారు. అదీ భాగవత సప్తాహం యొక్క గొప్పదనము, మహిమ. భాగవతానికి అంత గొప్పదనము, మహిమ ఎలా వచ్చాయంటే అది భగవానుడు శ్రీకృష్ణుని యొక్క దివ్య జీవిత విధానం కనుక. అంటే మనిషి ఎలా జీవిస్తే దేవతలు కూడా అతని ముందు తలవంచుకుని నిలబడతారో ఆ జీవిత విధానమందులో చెప్పబడివుంది. దాన్ని వింటే-

శ్రీకృష్ణుడు ఎలా జీవించమని తన ఆచరణ ద్వారా చూపించాడో అలా జీవించటానికి ప్రయత్నిస్తారు మీరు. కనుక భాగవత సప్తాహము విన్నవారి జీవితము కచ్చితంగా మారిపోతుంది. చుట్టుప్రక్కల వాళ్ళే ఆ మార్పుని గమనించి, ఆ మార్పు ఏమిటో మేము పట్టుకోలేకపోతున్నాము, కానీ ఆ మార్పు బావుంది అని అంటారు. అంటే మీరు కచ్చితంగా భాగవతాన్ని మీ మనస్సులలోకి ఎక్కించుకున్నారన్న మాట. మీ జీవితములో ఆ మార్పులు రాకపోతే, అది భాగవతం కానే కాదు. ఇది అర్థమైతే, మీరు భాగవతం వినే భావము మారిపోతుంది.



సుఖము కంటే దుఃఖమే మంచి గురువు. అది స్నేహితునివలె నీవు చేసిన అనేక తప్పులను గుర్తుచేసి నువ్వు సరైన దారిలో ప్రయాణించాలని తెలియజేస్తుంది.



వ్యాసభగవానుడు ద్వాపర యుగంలో వేదాల నన్నింటిని క్రోడికరించాడు. అప్పటివరకు వేదాలు లిపిబద్ధం కాలేదు. కేవలం శృతి- స్మృతి ద్వారానే ప్రజలలోకి వెళ్ళేవి. కనుక ఈ శృతి, స్మృతే భారతీయ ఆధ్యాత్మికతలో చాలా ప్రముఖపాత్ర వహిస్తాయి. వినటము నేర్చుకోవాలి. విన్నాక దాన్ని గుర్తుంచుకోవటం నేర్చుకోవాలి.

## నారదుని ప్రతిజ్ఞ

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం ।**

**అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనం॥**


భాగవతంలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అని తొమ్మిది రకాల భక్తుల గురించి చెపుతాడు. శిరిడిలో సాయి 'లక్ష్మి' అనే భక్తురాలికి నాణాలుగా ఇచ్చింది ఈ తొమ్మిది రకాల భక్తులనే. అందులో శ్రవణం అనేది మొదటి భక్తి. ఈ రోజులలో ఇది ఎక్కువగా ఉందని చెపుతారు.

ఒకసారి నారదుడు విష్ణుమూర్తితో ఒక మాట చెపుతాడు. ఏమని? నేను పృథ్వీలోకానికి వెళ్ళాను. అక్కడ మామూలు ప్రదేశాలలోనే కాదు పుణ్యక్షేత్రాలలో కూడా నాకు భక్తి అనేది కనిపించలేదు. కానీ యమునానది ఒడ్డుకి వెడితే అక్కడ ఒక అందమైన స్త్రీ తన ఇద్దరు పుత్రులతో కనిపించింది. ఆ పుత్రులిద్దరూ అతి ముసలి వాళ్ళుగా ఉన్నారు కానీ తల్లి మాత్రం యౌవనంలో ఉంది. ఆమె ముసలి రూపంతో మూర్ఛాస్థితిలో ఉన్న తన బిడ్డలిద్దరికి సేవ చేస్తోంది. అంతేకాక వందలాదిమంది



యువతులు ఆమెకు ఆ పనిలో సహకరిస్తున్నారు.

అప్పుడు నేను ఆమెతో మీరెవరు? ఎందుకిలా ఇక్కడ ఇంత బాధలో ఉన్నారు? అని ప్రశ్నించాను. దానికా యువతి నా ప్రక్కన ముసలిరూపంతో మూర్ఛాస్థితిలోవున్న వీరిద్దఱూ నా పుత్రులు. నేను వారి తల్లిని అని జవాబిచ్చింది.




నారద మహర్షి యమునా నది ఒడ్డున చూసిన ఆ అతి అందమైన యువతి భక్తి. ముసలి రూపంలో ఉన్న ఆమె పుత్రులు జ్ఞానవైరాగ్యములు.

నారదుడు ఈ విషయం భగవంతునికి చెపుతూ ఆయన దగ్గర ఒక ప్రతిజ్ఞ చేస్తాడు. ఏమని? కలియుగంలో నేను భాగవతాన్ని ఇంటింటికి తీసికెళ్ళి ప్రతిష్ఠ చేస్తానని. తన గురువులైన సనక సనందాదులకి కూడా ఈ వాగ్దానం చేశాడు. కనుక భాగవతము చదివిన వాళ్ళందరూ నారదుని యొక్క అనుగ్రహాన్ని పొందిన వారే. శ్రవణభక్తిలో మీకు ఈ విషయం గుర్తుండాలి. మీరు భాగవతం వింటున్నారంటే దానికి కారణం ఎవరో “అది మంచిది” అని చెప్పటం వల్లకాదు. గురువు యొక్క అనుగ్రహం వల్ల. కానీ మీలో భక్తితో పాటు ఈ జ్ఞానవైరాగ్యములు అభివృద్ధి చెందాలి.



చాలామందికున్న అపోహేంటంటే ఇవొస్తే ఇంక జీవితం ఎందుకని. కానీ అది తప్పు. ఎందుకంటే మీరు మీ పిల్లవాడిని ఇంజనీరింగ్ చదివించాలనుకున్నారనుకోండి. అంటే ముందు మీకు వాడది చదివితే జీవితములో వృద్ధిలోకొస్తాడు అనే జ్ఞానము ఉండాలి కదా! అలాగే భాగవతము వింటే నా జీవితములో ఏవిధమైన మార్పు లొస్తాయనే జ్ఞానము ఉండాలి. అది లేకుండా- సాధనలు, జపాలు, గురుచరిత్ర పారాయణలు, గురుపూజలు చేస్తున్నారు కనుక అవి ఫలించటము లేదు. కర్మకాండ సరిగ్గా చేస్తున్నాకానీ అవెందుకు చేస్తున్నాము? అన్న జ్ఞానం లేకపోవటం వలన మీరను కున్న ఫలితాలు రావటం లేదు. భగవన్నామం చేస్తున్నప్పుడు కూడా నామ మహిమ తెలియకుండా చేస్తే ఫలితం రాదు.



ఎవరైనా మీలోని లోపాలను ఎత్తి చూపిస్తే
వాళ్ళు మిమ్మల్ని బాధపెడుతున్నారు,
తిడుతున్నారనుకుని మీరూ తిట్టకుండా,
అవి నిజమైన లోపాలైతే సవరించుకోండి.
అప్పుడే మీరు జీవితములో ఉన్నత
శిఖరాలను అందుకోగలరు.

రామాయణములో రాముడు వనవాసానికి వెడుతున్నప్పుడు నది దాటాలొస్తే, గుహుడు అనే ఒక బోయవాడు సీతారామలక్ష్మణులను తన పడవలో ఎక్కించుకుని గంగానదిని దాటిస్తాడు. చాలామంది ఏమనుకుంటారంటే- అతను సీతాదేవితోకూడిన రాముణ్ణి నది దాటించాడు కనుక చాలా అదృష్టవంతుడు అని. కానీ లోతుగా గమనించినట్లయితే



గుహుడు మామూలు నావికుడు కాదు. మరి అతనెవరు? కేవలము పడవ దాటించటం వల్లనే తరించాడా? కాదు.





గుహుడు పూర్వజన్మలో ఒకానొక రాజ్యంలో ఒక ఋషి కుమారుడిగా పుట్టి ఆశ్రమవానం గడుపుతూ ఉండేవాడు. ఒకసారి తండ్రి ఏదో కారణం వలన బయటికి వెళ్ళాడు. కనుక ఈ ఋషి కుమారుడే ఆశ్రమాన్ని సంరక్షిస్తున్నాడు. అప్పుడు ఆ దేశపురాజు ఈ ఆశ్రమానికి వచ్చాడు.

ఋషి కుమారుడు రాజు రాకకు గల కారణం అడుగుతాడు. అప్పుడు రాజు 'నేను ఒక తప్పు చేశాను. అందువల్ల నాకు చాలా బాధగా ఉంది. నేను చేసిన తప్పుకి ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకుంటున్నాను. కనుక దానికేమి చేయాలో తెలుప' మని ఈ ఋషి కుమారుణ్ణి కోరాడు. అప్పుడు ఋషి కుమారుడు 'రాజా! నీవు చేసిన తప్పేమిటి?'అని ప్రశ్నించాడు. దానికి రాజు నేను ఫలానా తప్పు చేశాను అని చెపుతాడు.

తప్పులు చేయటం సహజమే. అందరూ తప్పులు చేస్తారు. కానీ చేసిన తప్పుని సవరించుకోకపోవటం ఇంకా పెద్ద తప్పు. ఆ తప్పుని దిద్దుకున్నవాడే మనీషి అనిపించు కుంటాడు.



నువ్వు విజయవాడకి వెళ్ళాలి. సరైన దారిలో వెడితేనే నువ్వు అక్కడికి చేరుకుంటావు. ఒకవేళ తెలియక తప్పు దారిలో వెడితే ఏమి చేస్తావు? ఆ దారిలోనే వెడతావా? లేక దారి మార్చుకుని సరైన దారిలో వెడతావా! సరైన దారిలో వెడతావుకదా! మరి మనిషి తన జీవితంలో చేస్తున్న తప్పులకి ఏదైనా ప్రాయశ్చిత్తం ఉన్నదా? అనేది ప్రశ్న. అసలా ప్రశ్న రావటానికి ముందే మీకు ఏది తప్పు వనో, ఏది కాదో తెలియాలి. పురాణాల్లో, ఉపనిషత్తుల్లో, రామాయణంలో చెప్పబడిన కథలను ఇవి తెలుసుకునేందుకు చదువుకోవాలి.



అవకాశము అందరికి వస్తుంది
కానీ కొందరే దాన్ని
ఉపయోగించుకోగలరు

సరే అప్పుడు ఋషి కుమారుడు ‘రాజా! నువ్వు చేసిన తప్పుకి రామ!రామ!రామ! అని మూడుసార్లు అనుకో, నీకు ప్రాయశ్చిత్తం జరిగి సమస్త పాపాలు పోతాయి’ అంటాడు. ఆ రాజు ఋషి కుమారుడు చెప్పినట్లే వెనువెంటనే మూడుసార్లు రామనామం చేస్తాడు. దానితో మహారాజు తను చేసిన పాపముల నుంచి ముక్తి పొంది, ఋషి కుమారునికి తన కృతజ్ఞతలు తెలియజేసి తన రాజ్యానికి తిరిగి వెళతాడు.



అంటే అక్కడ నామ మహిమ వలన రాజు తన పాపాల నుంచి బయట పడతాడు. నామానికి అంత మహిమ ఉంది కనుక భాగవతం మొదలెట్టే ముందే నామ సంకీర్తన చేసి తీరాలనే ఒక నియమము ఉంది. అది చెయ్యకుండా భాగవతం వింటే ఎలా? మనం కూడా అనేక వందలసార్లు రామ! అనో కృష్ణా! అనో లేక ఇంకేదైనా భగవన్నామాన్నో అనుకునుంటాము. కానీ ఏ పాపాలు పోతున్నాయి. రామ నామాన్ని ఒకసారి చేస్తేనే ఎన్నో పాతకాలు పోతాయంటే మరిన్నిసార్లు ఇంతమంది దేవతల నామాన్ని ఉచ్చరించినా మన పాపాలు ఎందుకు పోలేదు? మనం ఇంకా ఎందుకు ఇలానే ఉన్నాము? అంటే ఎక్కడో తప్పు జరిగిందని అర్థము..

అసలు భాగవతం మొదలెట్టే ముందే నామసంకీర్తనతో భజన చేసి తీరాలనే ఒక నియమము వున్నది. అది చెయ్యకుండా భాగవత సప్తాహం వింటే ఫలితాలు



వృక్షాల మీద ఆకుపచ్చని రంగు లత ఒకటి ప్రాకుతూ ఉంటుంది. దాన్ని తీగ అంటారు. దానికి కొమ్మలేవీ ఉండవు. కానీ ఏ చెట్టు మీదకైనా అది సునాయాసంగా ఎగబ్రాకగలదు. అంతేకాక వృక్షాలలో ఉన్న రసాన్ని పీల్చేస్తుంది. అలాగే మనిషిలోని అహంకారము తీగ లాంటిది. ఆ అహంకారం మనిషి సద్గుణాలనే రసాన్ని పీల్చేస్తుంది.



సమంగా రావు. సప్తాహానికి ముందు మీరు నామసంకీర్తనతో భజన చెయ్యకపోతే భాగవతంలో చెప్పినది మీకు సరిగ్గా అర్థము కూడా కాదు. అయితే మీకు భగవన్నామాన్ని ఉచ్ఛరిస్తూ భజన చేసే ముందు మీరెలా ఉన్నారు? భజన అయిపోయాక ఎలా ఉన్నారు? అన్నది తెలియకపోతే ఆ భజన చేయటము వృధా.


అంటే మీరు భజన చేయటము వలన వచ్చే లాభా లేమిటో తెలుసుకుని చెయ్యటం లేదన్నమాట. భజన ఎందుకు చెయ్యాలి? ఏది చేస్తే ఏవిధమైన ఫలితాలొస్తాయి? అనే జ్ఞానం లేదు మీకు. అందుకే భజన చేసినా మీకు సరైన ఫలితాలు రావటం లేదు.

## జ్ఞానవైరాగ్యములు

దానికి సంకేతంగానే భాగవతం ప్రారంభంలో నారదుడు చూసిన భక్తి అనే యువతి కుమారులైన జ్ఞానవైరాగ్యములు ముసలిరూపంలో ఉన్నారు కనుక దుఃఖి స్తోంది అని చెపుతాడు వ్యాసుడు. అంటే మీ యొక్క జ్ఞానవైరాగ్యములు అలా ఉన్నాయని అర్థము. నారదుడిలాంటి దేవర్షి వచ్చి కుదిపినా కూడా లేవలేకపోతారు వాళ్ళు. జ్ఞానవైరాగ్యములలో ఇదంతా జ్ఞానమునకు సంబంధించినది. కనుక ముందు ఈ జ్ఞానం అవసరం. ముందుగా జ్ఞానం వస్తే తర్వాత వైరాగ్యం అదే వస్తుంది.

మీరు మీ పిల్లవాడిని ఇంజనీరింగ్ చదివించాలంటే ఒక పది రూపాయలు సరిపోతాయా? చాలవు కదా! అలాగే కళాశాలలో చేరిన ఒక నెల రోజుల్లో మీ పిల్లవాడు ఇంజనీర్ అయిపోడుకదా. ఐదు సంవత్సరాలు కష్టపడి చదివితే అప్పుడు ఇంజనీర్ అవుతాడు. ఇవేవీ చెయ్యకుండా మావాడు ఇంజనీర్ అయిపోతాడంటే కుదరదు.






ముందు మీకు ఇదంతా తెలియాలి. తర్వాత దానికితగ్గ ఆర్థిక వనరులని సమీకరించుకోవాలి. మధ్యలో వచ్చే అనేక సమస్యలనెదుర్కోవాలి. ముఖ్యముగా మీరు అనేక కోరికలను చంపుకుని త్యాగాలు చేస్తేనే మీ పిల్లవాడు ఇంజనీర్ అవుతాడు తప్ప ఉత్తినే నోటితో మా పిల్లవాడు ఇంజనీర్ అవుతాడంటే అవడుగా! మీరు ఎందుకు మీ కోరికలను చంపుకుంటారు? ఎందుకు సాధారణ జీవితాన్ని గడుపుతారు? ఎందుకు మీ పిల్లల కోసం అనేక త్యాగాలు చేస్తారు? ఎందుకంటే -నా కొడుకు ఇంజనీర్ అవ్వాలి అనే లక్ష్యము వున్నదిగనుక.


ఒక లక్ష్యం కోసం మిగతావాటిపట్ల నిర్లిప్తంగా ఉండటం వైరాగ్యం. అంతేతప్ప మామూలు స్థాయి కంటే నీచంగా అడుక్కుంటూ దేశాటనం చెయ్యటం వైరాగ్యం కాదు. వైరాగ్యం అంటే లక్ష్యప్రాప్తి కోసం లక్ష్యమును గుర్తుంచుకుని మిగతావాటి పట్ల నిర్లిప్తంగా ఉండటము. కనుక ఈ వైరాగ్యం ఎందుకంటే లక్ష్యం సిద్ధింప చేసుకునేందుకు. మీ పిల్లవాడిని ఇంజనీరింగ్ చదివించాలంటేనే మీరు జీవితంలో 25 సంవత్సరాలపాటు అనేక త్యాగాలు చేసి నానా అవస్థలూపడి చదివిస్తారు. అప్పుడు



మీరు మిగతా విషయాలు పట్టించుకోరు. మరి అది వైరాగ్యమేకదా!


పిల్లవాడిని ఇంజనీరింగ్ చదివించటానికే దానిపట్ల మీకు సరైన జ్ఞానం ఉండి, మీరింత వైరాగ్యం చూపిస్తే, మరి భాగవతం చదవాలన్నా నేర్చుకోవాలన్నా మీకెంత జ్ఞానవైరాగ్యాలుండాలి? మీరేమో భాగవతం చదివామండి మరి మాకేం లాభాలొచ్చాయి? అని అంటారు. జ్ఞానవైరాగ్యములతో చదివితే కచ్చితంగా ఫలితాలొస్తాయి. మీరు ఆ దృష్టితో భాగవతం చదవరు కనుక సరైన ఫలితాలు రావు. నారదుడి లాంటి ఋషి కూడా మూర్ఛాస్థితిలో ఉన్న జ్ఞానవైరాగ్యములను నిద్రలేపలేకపోయాడు. ఆయన వాళ్ళని ఆ మూర్ఛాస్థితిలోంచి ఎలా బయటపడెయ్యాలి? అని ఆలోచిస్తూ వెళుతున్నాడు. ఇంతలో ఆకాశవాణి ఇలా వినిపించింది. 'ఒక యజ్ఞం ఉంది. దాన్ని కనుక నువ్వు నిర్వర్తిస్తే జ్ఞానవైరాగ్యములు నిద్రలేచి భక్తికి ఆనందాన్ని కలిగిస్తాయి. అలా ఆనందంగా కలిసినప్పుడు నీ కోరికలు తీరుతాయి' అని.

ఏదైనా ఒక మంచి విషయము వినగానే దాన్ని
వెంటనే ఒక పుస్తకములో వ్రాసిపెట్టుకుని
ఆచరించడానికి ప్రయత్నించాలి. అలాగే మంచి
ఆలోచన రాగానే దాన్ని వెంటనే అమలులోపెట్టడానికి
ప్రయత్నించాలి. ఇలా చేసినవారు జీవితములో ఉన్నత
లక్ష్యములు అనే మెట్లు త్వరగా ఎక్కుతారు.





## శ్రవణభక్తి




నారదుడి కోరిక ఏంటంటే సాధకునిలో భక్తితో పాటు జ్ఞానవైరాగ్యాలు కూడా ఉండాలని. అవి 3 కలిసేది సన్యసించటానికి కాదు. ప్రపంచాన్ని వదిలేయటానికి కాదు. జీవితాన్ని ప్రపంచములో ఒక క్రమశిక్షణతో ఆనందంగా గడపటానికి. కనుక భాగవతం చదివిన తర్వాత మీరు భౌతిక జీవితంలో ఇంకా ఆనందంగా జీవించాలని అర్థము చేసుకోవాలి. శ్రీకృష్ణుడు ఎంత ఆనందంగా జీవించాడు. అతని యొక్క కథ మీ జీవితాలలో అంత ఆనందాన్ని తీసుకురావాలితప్ప వైరాగ్యం అనే పేరుతోఉన్నది ఊడగొట్టుకోకూడదు. అది అర్థము కాకపోతే భాగవతం చదివినా చదవనట్లే. భాగవతము చదవటము వల్ల కచ్చితంగా మీ కోరికలు తీరుతాయి. తీరలేదంటే... అది భాగవతం తప్పు కాదు. రావణాసురుడు... మొదలగు వాళ్ళ కోరికలు తీరాయికదా! వాళ్ళు కోరికలు కోరుకోవటంలో తప్పు లేదు, కానీ వాటిని తప్పు దిశలో ఉపయోగించుకున్నారు. అదీ వాళ్ళు చేసిన తప్పు పని. కానీ వాళ్ళు భగవంతుడిచ్చిన ఆ వరాలను ఉపయోగించుకోనంతవరకు సుఖంగానే బ్రతికారు. ఉపయోగించుకోవటం మొదలెట్టారు కష్టాల ననుభవించారు. అంటే ఏ కోర్కెలు కోరాలి? ఏవి కోరకూడదో తెలియాలి.



కనుక అసలు భాగవతం ముందు సాధకుడు ఏ కోరికలు కోరుకోవాలి? ఎలా కోరుకోవాలి? అనేది తెలుపుతుంది. భాగవతం వింటే ఇప్పుడున్న జీవితం కంటే ఎక్కువ ఆనందంగా జీవించాలి. భక్తితో భాగవత సప్తాహ పారాయణ చేస్తే మీ కోరికలన్నీ తీరుతాయి. కానీ మీకు భాగవతాన్ని వినటం రావాలి. అదేంటండి 'మాకు వినటం ఎందుకు రాదు?' అంటారు. విన్నది ఆచరిస్తేనే అది వినటం అవుతుంది తప్ప ఉత్తినే వినేసి వెళ్ళిపోతే అది వినటం అవదు. అలా శ్రద్ధతో విన్నా దాన్నే శ్రవణభక్తి అంటారు.

ఈనాడు శ్రవణభక్తి ఎక్కువగా ఉందని చాలామంది చెపుతున్నారు. టి.వి.లో సంస్కార్ ఛానెల్‌లో అనేకమంది ఆధ్యాత్మికవేత్తలు ఉపన్యాసమిస్తే లక్షలాదిమంది వింటూంటారు. వాళ్ళందరూ ఉత్తినే వినేసి వెళ్ళిపోతున్నారు తప్ప ఉపన్యాసకులేం చెపుతున్నారో అది అర్థము చేసుకోవటంలేదు. అంటే కేవలం వినటం తప్ప ఆచరణ మాత్రం శూన్యం. ఇది సరైన శ్రవణభక్తి కాదు. కేవలం చెవులతో వినటం అవుతుంది.

**ఇందుగలడందులేడని సందేహంబు వలదు ॥**

**చక్రిసర్వోపగతుడై ఎందెందు వెదికిన అందందె గలడు దానవాగ్రణి వింటే ॥**

వింటే-- అన్నాడు ప్రహ్లాదుడు హిరణ్యకశ్యపుడితో. సర్వత్రా వ్యాపించియున్న విష్ణుమూర్తి చూస్తే కనిపిస్తాడు అనలేదు, 'వింటే' కనిపిస్తాడని అంటాడు ప్రహ్లాదుడు. కనుక భాగవతం 'వింటే' మీకు భగవంతుని దర్శనమవ్వాలి. దర్శనమయ్యేట్లు వినటం రావాలి. భగవంతుడినే గురురూపుంగా పూజిస్తాము కనుక గురువు అంతటా ఉన్నాడు అని చెపుతాం. అందుకే ఆయన్ని ఇలా స్తుతిస్తాము.

**అఖణ్డమణ్డలాకారం వ్యాప్తం యేన చరాచరమ్।**



తత్పదం దర్శితం యేనా తస్మై శ్రీగురవే నమః ॥

ఇలా అన్నప్పుడు మీకు మీ ఎదురుగా గురువున్నాడు అనే అనుభూతి ఉండాలి. గురువే అక్కడ కూర్చుని ఉంటే మీ ప్రవర్తన ఎలా ఉంటుంది. కచ్చితంగా ఇలా ఉండదు. ఉంటే ఇలా ఉండరుగా? అంటే మీలో శ్రవణభక్తి లేదన్నమాట. మీకు శ్రవణభక్తి కనుక ఉంటే భగవంతుడు మీకు ప్రతి కణములో కనిపించకపోయినా, ఇక్కడ సర్వాంతర్యామియైన భగవంతుడున్నాడు అనే భావన వస్తుంది.


సాయిబాబా కూడ అదే అంటాడు. ఐదున్నర అడుగుల ఈ శరీరమే నేను అనుకుంటే మీరు నన్ను అర్థము చేసుకోలేదు. మీరు కనుక చూడగలిగితే నేను అంతటా ఉన్నాను అంటాడు. కృష్ణుడు కూడా నా జన్మ మరియు కర్మ కూడా దివ్యమంటాడు.

మనకంటి ముందు ఏది కనిపించినా అది భగవంతుని యొక్క స్వరూపంగా కనిపించాలి. శ్రద్ధ, విశ్వాసము ఉంటే కనిపిస్తాయి. మీరు మానసికంగా నిరంతరం ఇది ఎప్పుడు అభ్యసిస్తారో అప్పుడు మీకు శ్రవణభక్తి వచ్చేసిందని అర్థము. ఈ వినటం అనేది ఎలా ఉండాలో సినిమాలోని ఒక సంఘటన ద్వారా చెపుతాను, అర్థము




*మీరు సాధించాలనుకున్న లక్ష్యమును ఒక కాగితం మీద వ్రాసి పెట్టుకోండి. దాన్ని ప్రతిదినము దానిని గమనిస్తూ ఉంటే మీకు ఆ లక్ష్యమును పూర్తిచేయాలన్న స్ఫూర్తి కలుగుతుంది.*






చేసుకోండి.

దిల్ అనే సినిమాలో తండ్రి తన కొడుకు హాయిగా కుర్చీలో కూర్చుని వారపత్రిక చదువుకోవటం చూసి 'నాయనా! ఇది చదువుతూ నీ సమయాన్ని ఎందుకు వృధా చేసుకుంటావు. పాఠ్యపుస్తకాలు చదువుకో' అంటాడు. అప్పుడు కొడుకు నేను చదువుకుని ఉద్యోగం సంపాదించుకుని చివరికి చేసేదేమిటి? అని అడుగుతాడు తండ్రిని. హాయిగా కాలుమీద కాలు వేసుకునికుర్చీలో కూర్చుంటావు అన్నాడు తండ్రి. అప్పుడు కొడుకు నేను ఇప్పుడు చేస్తున్న పని అదే అంటాడు. అంటే అక్కడ తండ్రి నువ్వు ఉద్యోగము సంపాదించుకుంటే హాయిగా కుర్చీలో కూర్చుంటావు అన్న దానికి-కొడుకు 'నేను కుర్చీలోనే కూర్చున్నాను' అన్న దానికి అసలు భావ సంబంధం లేదు. తండ్రి ఒక ఉద్దేశ్యంతో అంటే కొడుకు ఇంకోవిధంగా జవాబిచ్చాడు.

అంటే ఇక్కడ శ్రవణభక్తి వ్యతిరేక దిశలో వున్నది. మాటలు వినటము ముఖ్యం కాదు. ఆ మాటల వెనక ఉన్న అంతరార్థము ముఖ్యం. తండ్రి కొడుకుతో 'నా మాట వింటే బాగుపడతావురా!' అంటాడు. ఇక్కడ 'వింటే' అంటే అర్థము-విన్నది ఆచరించాలని. ఆ మాట మర్చిపోయారు అందరూ. భగవంతుని గురించి తెలుసు కోవాలనుకుంటున్న మీకు భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు,




కరుణామయుడు, ప్రేమమూర్తి అన్న నమ్మకముందా? ఉంటే మీ జీవితాలిలా ఉండవు.

ఆయన మీకు కష్టం ఇస్తాడా? ఇవ్వడు. ఒకవేళ ఇచ్చినా మీకిచ్చిన కష్టాలను ఆయన అనుగ్రహంగా భావించి అనుభవించాలి. ఈ భావం వస్తే మీకు ఏవీ కష్టాలుగా అనిపించవు. కష్టాలు మాత్రమేకాదు, సుఖాలు కూడా భగవంతుడే ఇస్తాడు. సర్వ వ్యాపకమైన భగవంతుని శక్తి అణువణువులోనూ ఉంది. ఆ శక్తి నాకు ఇబ్బందులు కలిగించదు అన్న నమ్మకం ఉండాలి మీకు. ఒకవేళ నాకు ఏదైనా కష్టం వస్తే అది నా మేలు కోరి భగవంతుడే ఇచ్చాడన్న భావన రావాలి.

బిడ్డకి అనారోగ్యం చేస్తే తల్లి పాయసం పెట్టదుగదా? కనుక మొదట మీకు భగవంతుడు నాకు కష్టాలిచ్చినా అవి నా మంచికోసమే అన్న విషయం అర్థ మవ్వాలి. మీకు ఆ అనుభూతి లేదు. దాన్ని అనుభూతి చెందినవాళ్ళు అది ఇలా ఉంటుంది నాయనా! అని చెపుతున్నారు. మీరు వాళ్ళు చెప్పింది నమ్మి విని ఆచరిస్తారు. దాన్నే శ్రవణభక్తి అంటారు. మీకు శ్రవణభక్తి రావాలంటే చెప్పిన విషయం మీద నిష్ఠ ఉండాలి.

ఇతరులు మన ఎడల ఏవిధముగా ప్రవర్తించాలని కోరుకుంటామో మనం కూడా ఇతరుల యెడ ఆవిధముగానే ప్రవర్తించాలి.





## కీర్తనం




శ్రవణభక్తి తర్వాతది కీర్తన భక్తి. మీ జీవితాలలో శ్రవణభక్తి వల్ల దైవం మీద నమ్మకమొస్తుంది. ఆ నమ్మకంవలన మీ జీవితాలలో మీకు ఎప్పుడో అప్పుడు మీరు ఊహించని రీతిలో దైవ సహాయం వచ్చే ఉంటుంది. దాన్ని చెప్పుకుంటూ చివరికి అనేకమంది గురువుల, భక్తుల జీవితాలలో జరిగిన సంఘటల ద్వారా భగవంతుని మహిమలను గుర్తుచేసుకుంటారు. ఇది కీర్తనభక్తి. భగవంతుని యొక్క ప్రతి నామము వెనకాతలా ఒక మహత్తరమైన సంఘటన ఉంటుంది. వాటినే అష్టోత్తరాలుగా చెబుతారు.

'మురారి' అనే నామము తీసుకోండి. దీని వెనకాతల ఒక కథ వున్నది. దాన్ని చెప్పుకుంటే అది మీకు ఆనందాన్ని కలుగచేస్తుంది. మీకు భగవంతుడు సర్వసమర్థుడు అన్న విశ్వాసము లేక పనులు జరగటం లేదు. అంటే ఆయన మీ కష్టాలు తీర్చగలడో లేడో అన్నమానం ఉంది. అది మీ కోరికలు తీరకుండా అడ్డుతగులుతోంది తప్ప లేకపోతే ప్రపంచములో కోరికలు తీరకపోవటం అనేది ఉండదు.

కృష్ణుడు కంసుణ్ణి చంపేశాడనే కోపంతో అతణ్ణి చంపెయ్యాలని జరాసంధుడు, కాలనేమి.... మొదలగు రాక్షసులు మధురని చుట్టుముడతారు. వాళ్ళు అనేకమంది



ప్రజలను బంధించి, మధురలోని పెద్దలతో ‘మీరు కనుక కృష్ణుణ్ణి మాకు అప్పజెపితే మీ ప్రజలను వదులుతాము లేకపోతే వాళ్ళని చంపేస్తామని’ బేరము పెడతారు. వాళ్ళు మేము కృష్ణుణ్ణి ఇవ్వమన్నారు. ఇదంతా గమనిస్తున్న కృష్ణుడేం చేశాడో తెల్సా?

మహామాయని పిల్చి ‘సముద్రంలో ద్వారక అను నగరాన్ని నిర్మించి, మధురలో ఉన్న వాళ్ళందరినీ కూడా రాత్రికి రాత్రి అక్కడికి తరలించు’ అని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు యోగమాయ కృష్ణుడు చెప్పినట్లే రాత్రికిరాత్రి మధులోని ప్రతి అణువుతో సహా ద్వారకకి తరలిస్తుంది. జంతువులతో పాటు మనుష్యులు కూడా మేము కొన్ని తరాలబట్టీ ద్వారకలోనే జీవిస్తున్నాము అనే భావనతోనే ఉన్నారుతప్ప మధుర నుంచి ఒక్క రాత్రిలో అక్కడికొచ్చామన్న సంగతి వాళ్ళకి తెలీదు. ఇది సంభవమేనా! అన్న అనుమానమొస్తుంది మీకు. భగవంతుని మీద నమ్మకముంటే కచ్చితంగా సంభవమే.

కష్టపడి నీతిగా
సంపాదించిన
ధనమునే
స్వీకరించాలి.




సాయిబాబా చరిత్రలో ఒక వ్యక్తి సాయిని చూడాలని ఉద్యోగానికి సెలవు పెట్టుకుని ఆయన దగ్గరికి వస్తాడు. సాయిబాబా అతణ్ణి ‘నువ్వు ఉద్యోగానికి వెళ్ళక నా దగ్గరే ఉండిపో’ అంటాడు. కానీ అతను కొన్నాళ్ళున్న తర్వాత ఉద్యోగం పోతుందనే భయంతో సాయి ఉండమన్నా వినకుండా ఊరికి బయలుదేరి వెళ్ళిపోతాడు. మర్నాడు



భయపడుతూ కార్యాలయానికి వెళతాడు. తన పై అధికారి దగ్గరికి వెళ్ళి 'తనిన్నాళ్ళూ బాబా దగ్గరికి వెళ్ళాడు కనుక ఉద్యోగానికి రాలేకపోయానని, కావున తనని క్షమించమని' అడుగుతాడు. ఆ అధికారి పైకి ఏం మాట్లాడడు. కానీ మనసులో మాత్రం రోజు వస్తూనే వున్నాడు, అయినా రాలేదని అంటున్నాడు, ఇతని కేమన్నా పిచ్చా అని అనుకుంటాడు. అలాగే ఆఫీస్‌లోని మిగతావాళ్ళు కూడా అతను నెలరోజులబట్టీ ఆఫీసుకి రాలేదేమని అడగటంలేదు. ఇతనికి పరిస్థితి అయోమయముగా ఉంది. సరే ఇతనే వాళ్ళని 'నేను నెలరోజుల బట్టీ ఆఫీసుకి రాకపోతే మీరెవ్వరూ ఎందుకు రావటం లేదని నన్ను అడగరేంటి' అని అంటాడు. రాకపోవట మేంటి? నువ్వు నిక్షేపంగా రోజూ ఆఫీస్‌కి వస్తూనే ఉన్నావుగా! అంటారు వాళ్ళు. అతడు ఇది విని ఆశ్చర్యపోతాడు. ఇది బాబా చమత్కారము అని అర్థమౌతుంది.

అంటే అక్కడ ఏం జరిగింది? సాయే అతని రూపంలో ఉద్యోగాని కెళ్ళాడు. మరి భగవంతుడు మీ పనులని చేసిపెట్టలేడా? మీ కోరికలు తీర్చలేడా? తీర్చగలడు. మీరడిగింది ఆయన చేసి పెడతాడనే నమ్మకం మీకు ఎందుకు లేదు? మీ కోరికలు తీరవని ఎందు కనుకుంటున్నారు? భగవంతుడి మీద ఆ నమ్మకాన్ని తెచ్చుకోండి. భక్తుల జీవిత చరిత్ర చదివి ఆ సంఘటన అలా జరిగిందా! అని





చెప్పుకుంటున్నాముగా! అలా చెప్పుకోవటమే కీర్తనభక్తి. అందరి గురువు చరిత్రలోనూ ఇది జరుగుతుంది.

> **వ్యక్తి విలువను అతని సంపద, విద్యార్హత ద్వారా కాక అతని సత్కర్మలు, సదాలోచనల ద్వారా గుర్తించాలి.**


## జిళ్ళెళ్ళమూడి అమ్మ మహిమ

జిళ్ళెళ్ళమూడి అమ్మ దగ్గర కూడా ఇలాంటి సంఘటన జరిగింది. ఒకసారి ఒక ఆస్తికుడితో ఒక నాస్తికుడు అమ్మ దగ్గరికి వెళ్ళాడు. ఈ నాస్తికుడికి ఆవిడ రూపాన్ని, చర్యలని చూస్తేనే చిరాకుగా ఉంది. అయినా అవన్నీ సహిస్తూ వచ్చాడు కనుక ఎలాగో కాలం గడుపుతున్నాడు.

సరే రాత్రి తొమ్మిదయ్యింది. ఇంతలో ఒకతను అమ్మ దగ్గరికి ఏడుస్తూ వచ్చి అమ్మా! నా ఇల్లు వేలానికి వచ్చింది. నేనది భరించ లేకుండా ఉన్నాను. నా కష్టాన్ని తీర్చు అని ఆవిడ పాదాలమీద పడతాడు. ఆవిడ 'ఏం పర్వాలేదు నాయనా! ఆ సంగతి నేను చూసుకుంటాల్లే' అని ఓదార్చింది. నాస్తికుడు మనసులో 'ఇల్లు వేలము వేయకుండా ఉండాలంటే డబ్బు కట్టాలి, ఈవిడ దగ్గర డబ్బెక్కడుంది? అంతా మోసము' అనుకుంటాడు. సరే నాస్తికుడు ఆ రాత్రికి ఆశ్రమం లోనే భోజనం చేసి తన స్నేహితుడితో పాటు పడుకుంటాడు.



అతని ప్రక్కనే రాత్రి ఏడుస్తూ అమ్మ దగ్గరికి వచ్చిన వ్యక్తి కూడా పడుకుంటాడు. తెల్లవారింది. అయితే ఆ రాత్రి ఏడ్చినవాడు మర్నాడు హాయిగా రాత్రి అసలేమి జరగనట్లే తిరుగుతు ఆశ్రమంలోని పనులు చేస్తుంటే 'వీడు రాత్రి ఏడుస్తూ వచ్చాడు, ఇప్పుడేమో అసలేమి జరగనట్లే ఆనందంగా పనులు చేసుకుంటున్నాడు, ఇదెలా సంభవము? అని నాస్తికుడికి ఆశ్చర్యం వేస్తుంది.




అతని దగ్గరకెళ్ళి 'రాత్రి ఏం జరిగింది? రాత్రి ఏడుస్తూ వచ్చావు. ఇప్పుడింత హాయిగా ఎలా ఉన్నావు? అని అతణ్ణి అడుగుతాడు. అప్పుడువాడు నేను రాత్రి బాధలో ఇంట్లో వాళ్ళకి చెప్పకుండా అమ్మ దగ్గరికి వచ్చాను. అమ్మ నా బాధ తీరుస్తానంది. అప్పుడు నేను కుదుటపడ్డాను. కానీ ఇంట్లో వాళ్ళెలా ఉన్నారో, పరిస్థితి ఎలా ఉందో చూద్దామని రాత్రి 2గంటలకి ఇంటికి వెళ్ళి తలుపుతడితే నా భార్య తలుపు తీసింది. నేను నా భార్యని 'మన ఇల్లు ఎవరు కొన్నారు?'అని అడిగాను. దానికి ఆవిడ 'మన ఇల్లు ఎవరో కొనడమేమిటి?సాయంత్రము మీరు బాకీ తీర్చేశారుగా! అందుకని ఇల్లు వేలం వేయలేదు' అని చెప్పింది.


నాకు అది అమ్మ మహిమ అని అర్థమైంది. అందుకని రాత్రి మళ్ళీ అమ్మ దగ్గరికే వచ్చి ఆశ్రమంలోనే పడుకున్నాను అంటాడు. అంటే అమ్మ దగ్గరికి ఇతను



వెడుతున్నప్పుడే ఇతని డబ్బులు కట్టడం అయిపోయిందనేగా అర్థము. కానీ అమ్మ అతనికి ఏమీ చెప్పలేదు. తనని నమ్ముకొనొచ్చిన అతనికి తను చెయ్యవల్సింది చేసింది. అంతే!!

## దైవంమీద నమ్మకం తెచ్చుకో!

మరి మాకెందుకు ఇలా జరగటం లేదు అంటే మీకు 'ఇలా జరుగుతుందా!' అన్న అనుమానంతప్ప భగవంతుడి మీద నమ్మకం లేదు. భాగవతం మీకేం చెపుతుందంటే భగవంతుడి మీద ఆ నమ్మకాన్ని పెంచుకోమని. విశ్వాసరాహిత్యము ఈనాడు చాలా బాగా వ్యాపించింది. ఎవ్వరికి ఎవ్వరిమీదా నమ్మకం లేదు. అన్నింటికి కాయితాలు వ్రాసుకుంటారు. చట్టాలని నమ్ముతున్నారు. మనిషి మీద నమ్మకమే లేదు.



**ఏ సంస్థలో నైనా వ్యక్తులు ఆదర్శాలకు అతుక్కోవాలి తప్ప వ్యక్తికి కాదు.**

చైనావాళ్ళలో ఈ నమ్మకం అనేది బాగా వున్నది. వాళ్ళు నేను వచ్చేజన్మలో నీ అప్పు తీరుస్తాను అని చెప్పి, ఈ జన్మలో డబ్బు అప్పు తీసుకుంటారు. వాళ్ళు నిజమైన భారతీయులు. వాళ్ళకి భగవంతుడిమీద ఉన్న విశ్వాసం మీకు వున్నదా? అది లేకపోతే ఏ గురువూ, భగవంతుడూ మీకు సహాయము చెయ్యలేడు. కీర్తనభక్తిలో భగవంతుడి అనుగ్రహం వలన వాళ్ళకి ఇలా జరిగిందిట! అనే విషయాలను వింటున్నప్పుడు దైవంమీద మీకు ఆ నమ్మకం



గురువు ఎవరు? అన్నది ముఖ్యము కాదు;
సమర్పణ ఎంత? అన్నది ముఖ్యము.

వస్తే, మీకూ అలాంటి సంఘటనలు జరుగుతాయి.


సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు, కరుణామయుడు, ప్రేమమూర్తి అయిన భగవంతుడు నాకు అండగా ఉండగా నాకేంటి భయం అనే నమ్మకాన్ని మీ మనసులో తెచ్చుకోండి. రామాంజనేయ యుద్ధంలో రాముడు ఓడిపోతాడు. హనుమ గెలుస్తాడు. దానికి కారణం ఆంజనేయుడి యొక్క విశ్వాసమే. మరి మీరు భగవంతుణ్ణి ఓడించలేరా! ఓడించగలరు. కానీ మీకు దైవం మీద శ్రద్ధ ఉండాలి. ఉంటే ఓడించగలరు.

భాగవతం చదివి మీరు ఆ శ్రద్ధని తెచ్చుకోండి. కీర్తన అంటే విశ్వాసము కలుగజేసే సంఘటనలను గురించి నెమరేసుకోవటం. కనుక అష్టోత్తరాలు....... అవన్నీ కీర్తనలే. భగవంతుడు చేసిన చమత్కారాలను నామరూపంలో కీర్తిస్తాము. కలియుగంలో నామ సంకీర్తన చేయటం చాలా మంచిది. ఈ జన్మలో భాగవతం వింటున్నారంటేనే అర్థము మీకు పూర్వజన్మలో దీనితో ఎంతో సంబంధం వున్నది అని. కనీసం ఈ జ్ఞానమైనా ఉంటే మీరు అప్పుడు భాగవత సప్తాహాన్ని ఉపయోగించుకోగలుగుతారు. ఏ నామము గొప్పది? అన్న వాదన పెట్టుకోకండి. ఏ నామమైన ఒకటే.

ఇంక మళ్ళీ గుహుడు కథలోకొస్తే పూర్వ జన్మలో ఋషికుమారుడైన గుహుడు ఆ రాజు చేసిన పాతకానికి మూడు సార్లు రామ అనమన్నాడుకదా! రాజు మూడుసార్లు‘ రామనామాన్ని’ ఉచ్చరించి పాప విముక్తుడయ్యాడు. సరే తండ్రి



ఆశ్రమానికి తిరిగొచ్చిన తర్వాత కొడుకు జరిగిన విషయం చెపుతాడు. అప్పుడు తండ్రి ఆ రాజు చేసిన పాపానికి ఒక్కసారి రామనామం ఉచ్చరిస్తే చాలు. నువ్వు మూడుసార్లు అనమన్నావు. అంటే నీకు రామనామం మహిమ తెలీలేదు. కనుక నీకు అది తెలిసేందుకు, వచ్చే జన్మలో నువ్వు నామ ముచ్చరించటానికి అర్హత లేని కులములో పుడతావు. అప్పుడు రాముణ్ణి నది దాటిస్తే నీకు మళ్ళా నా ఆశ్రమం లోనికి ప్రవేశం లభిస్తుందని శపించాడు.




అప్పుడు ఆ ఋషి కుమారుడు తర్వాతిజన్మలో గుహుడనే నావికుడిగా పుట్టి రాముణ్ణి నది దాటించాక తన పాపం నుంచి ముక్తి పొందుతాడు. నామం యొక్క శక్తి మీకు అవగాహన అవ్వటానికి రామాయణములో వాల్మీకి ఆ కథ చెప్పాడు. అందుచేత మీరు నామాపరాధము మటుకు చెయ్యకండి. ఏ నామమును ఉచ్చరించినా ఆ దైవాన్నే లేక మీ గురువునే భజిస్తున్నారు.

గురుర్బ్రహ్మ ర్గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః । గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ॥

అని నోటితో అనటము కాదు. కీర్తన చెయ్యండి. ఏ గురువుని పూజించినా జగద్గురువైన కృష్ణుణ్ణి పూజించినట్లే. శ్రవణభక్తి అంటే ముందు భగవంతుని గుణగణాల గురించి, మహిమను గురించి వినాలి, విన్న తర్వాత వాటిని ఆచరించటానికి ప్రయత్నించాలి.



ప్రతీ తీర్థస్థలములోనూ శక్తి ఉంటుంది. ఆ శక్తి మనిషి తనంతటతను పరిస్థితుల్లోనూ, మనస్సులోనూ తెచ్చుకోలేని మార్పులను తెస్తుంది.



భగవంతుని గుణగణాలను వినండి. అప్పుడు ఆయన సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు, కరుణామయుడు, ప్రేమమూర్తి అన్న విశ్వాసం ఏర్పడుతుంది.

సాయిబాబా చరిత్రలో ఒకసారి ఆయన భక్తురాలైన లక్ష్మితో 'అమ్మా లక్ష్మీ! నాకు చాలా ఆకలేస్తోంది. తినటానికి ఏదైనా ఉంటే పెట్టు' అన్నాడు. వెంటనే ఆవిడ కొన్ని మధుర పదార్థాలను వండుకొచ్చి బాబా ముందుపెట్టింది. బాబా వాటిని తను తినకుండా అక్కడున్న కుక్కకి పెడతాడు. కుక్క వాటిని తినేసింది. అది చూసి లక్ష్మి బాధపడుతుంది. అప్పుడు బాబా' నేను తిన్నా కుక్క తిన్నా ఒక్కటే' అన్నాడు. ఆ సంఘటన ద్వారా బాబా తాను సర్వాంతర్యామి నని చాలా స్పష్టంగా చెప్పటానికి ప్రయత్నించాడు. అలా అని బాబా కుక్కని తీసుకొచ్చి తన నెత్తిమీద పెట్టుకోలేదు. దాన్ని ఎక్కడుంచాలో అక్కడే ఉంచాడు.

దీన్నే గీతలో --పణ్డితా సమదర్శినః-- అన్నాడు శ్రీకృష్ణుడు. కుక్కలో కూడా భగవంతుణ్ణి చూడటానికి ప్రయత్నిస్తే అది వచ్చేస్తుంది.' మేము ఆ స్థితిలో ఉండాలి'



అని ప్రయత్నించటమే మీ వంతు. ఫలితం ఆయనిస్తాడు. భగవంతుడు మీకు కష్టాలు ఇవ్వడు. ఒకవేళ ఇచ్చినా ఆ కష్టం మీ మంచికే ఇచ్చాడు అన్న విశ్వాసాన్ని పెంచుకోండి. ఒకవేళ కష్టాలను భరించలేకపోతే భగవంతుడా! నేను నువ్వే నా సర్వస్వం అనుకున్నాను. మరి నాకెందుకు కష్టమిచ్చావు? అని ఆయన్నే అడగండి.

**త్వమేవ మాతా చ పితా త్వమేవ, త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ ।**

**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ, త్వమేవ సర్వం మమ దేవ దేవా!!**

మీరు భగవంతునితో ఆ ఆత్మీయత సంపాదించుకొండి. పురాణాలలో చాలా విచిత్రమైన కథ వస్తుంది. ఆ కథ విని గుర్తుంచుకుంటే మీ జీవితాలు మారిపోతాయి.

బ్రహ్మదేవుడు సత్యలోకంలో తన పనులలో నిమగ్నమై ఉన్నాడు. ప్రతి ప్రాణి యొక్క సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలను నుదిటిన వ్రాసే ఆయన ఎప్పుడూ ఖాళీగా ఉండలేడు కదా! ఒకసారి ఆయన దగ్గరికి దేవతల తరుపున దేవతల రాజు ఇంద్రుడు, మానవుల తరుపున మనువు, అలాగే రాక్షసుల రాజు ముగ్గురు వెళ్ళారు. వెళ్ళి ఆయన్ని మాకు ఏదైనా దీక్షనియ్యండి అన్నారు. అప్పుడాయన ‘ద’ అనే అక్షరాన్ని దీక్షగా ఇచ్చాడు. ఇంద్రుడు దేవతలమైన మాకు ఇంద్రియాల మీద దమం లేదు కనుక ద-అంటే దమం అభ్యసించమన్నాడు అనుకున్నాడు. మనువు మనుష్యులమైన మాకు దానం

ఆత్మవిద్య అవగాహనకు కావల్సిన మొదటి లక్షణము- వైరాగ్యము.
వైరాగ్యము అంటే భౌతికజగత్తు వద్దు అని కాదు.
బాధ్యతగా అసంగత్వముతో జీవించటమే వైరాగ్యము.



చేసే గుణం లేదు కనుక -ద- అంటే దానం చేయమన్నాడు అనుకున్నాడు. రాక్షసుడు మాకు దయ లేదు కనుక -ద- అంటే దయ అనుకున్నాడు. ఎవరి భావానుసారం వాళ్ళు బ్రహ్మ చెప్పిన దాన్ని వారందఱూ ఆచరించి తదనుగుణ్యంగా ఫలితాలను పొందారు.




## భగవచ్ఛక్తి అవతరణ

మరి భాగవతం విన్నాక కూడా మీ జీవితంలో ఏ మార్పూ రాలేదంటే మీరు భాగవతం వినలేదని అర్థము. భౌతిక జగత్తులో పూర్వంకన్నా ఇప్పుడు పెద్దపెద్ద యంత్రాలు ఉపయోగించటం మానేసి చిన్న యంత్రాలనే ఉపయోగిస్తున్నాము. వాటిని నడిపే శక్తి విద్యుచ్ఛక్తి ఒక్కటే. కానీ దాని యొక్క నియమాలు మాత్రం మారలేదు. అంటే యంత్రాలు చిన్నవైనా పెద్దవైనా విద్యుచ్ఛక్తి మాత్రం ఒకటే. మీకు విద్యుచ్ఛక్తి యొక్క నియమాలు తెలిస్తే ఇప్పటి యంత్రాలనే కాదు, రేపు రాబోయే యంత్రాలని కూడా ఉపయోగించుకోగలుగుతారు.

అలాగే ఆధ్యాత్మిక జగత్తులో కూడా భూత భవిష్య వర్తమాన కాలాలలో ఏ శక్తిని గురించి తెలిస్తే అన్ని కోరికలు తీరుతాయో ఆ శక్తిని -భక్తి- అని అంటాము. అంటే మీ భక్తి దేనిమీదుంటే ఆ కోరికలు తీరుతాయి. ఈనాడు భక్తులు ఎక్కువయ్యారని చెపుతున్నారు. నిజానికి భక్తులు ఎక్కువ అవ్వ లేదు, కోర్కెలు తీర్చుకునే వాళ్ళు ఎక్కువ అయ్యారు. సాయిబాబా గుడికి ఎందుకు అంతమంది మనుష్యులు



వెడుతున్నారంటే కోరికలు తీర్చమని ఆయన్ని అడగటము కోసం. కానీ అసలు సాయి అవతారము ఎందు కొచ్చింది? ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించటానికి. అది మాత్రం అడగట్లేదు.

సాయిబాబా 72 గంటల పాటు సమాధిస్థితిలోకి వెళ్ళే ముందు ఇంక నేను తిరిగిరాను అనే అనుకున్నాడు. అందుకని మహాల్సాపతితో -నేను ప్రజలకి చాలా జ్ఞానమును ఇవ్వాలనుకుని వచ్చాను. కానీ అందరూ కోరికలు తీర్చమనే అడుగుతు న్నారు తప్ప ఎవ్వరూ నేనిచ్చే జ్ఞానమును అడగటం లేదు. నాకది బాధగా ఉంది. కనుక నేను పైకి వెళ్ళి ఇంకా జీవితాన్ని కొన సాగించాలా? వద్దా? అనేది నిర్ణయించు కుని వస్తాను. అంతవరకు నా శరీరాన్ని కాపాడు' అని అడుగుతాడు. తర్వాత తిరిగొస్తాడు, అంటే కొంతమందైనా ఆత్మజ్ఞానము కావాలని అడిగే వాళ్ళున్నారన్నమాట.

నేడు ఎవ్వరూ కూడా 'నాకు తినటానికి తిండి ఉంది, పడుకోవటానికి ఇల్లుంది. నాకు పెద్దగా కష్టాలుకూడా ఏమీ లేవు. ఉన్నవి కూడా స్వయంకృతాపరాధమే. కనుక ఒక్కసారైనా శిరిడి సాయి, సత్యసాయిలాంటి మహానుభావులు ఎందుకు అవతరించారు?' అనే ప్రశ్నే వేసుకుందాం అని అనుకోవటం లేదు. మనస్సు చేసే తమాషా అది. మీరేమనుకుంటారంటే ఆయన మీ అమ్మాయికి పెళ్ళి జరిపించటానికి,

కేంద్రీకృతమైన, సత్యమైన అవగాహన కల్గిన, స్థిర నిశ్చయము కల్గిన ప్రజాభిప్రాయము ప్రపంచములో అత్యంత శక్తివంతమైనది.





మీ అబ్బాయికి ఉద్యోగం ఇప్పించటానికి, మీ మిగతా కోరికలు తీర్చటానికి వచ్చాడని. శిరిడిసాయి లేకపోతే ఇదివరకు ఎవరికి పెళ్ళిళ్ళు అవ్వలేదా? అయ్యాయిగా. మరప్పుడు ఏ భగవంతుడు వాళ్ళకి పెళ్ళి కుదిర్చాడు? మీరు నమ్ముకున్న భగవంతుడే. అందుకని మీ కోరికలు తీర్చటానికి సాయిబాబా అవతరించక్కర్లేదు. ఆయన సర్వవ్యాపకుడు కనుక భూమిమీద అవతరించకపోయినా మీ కోరికలు తీర్చగలడు.

సాయిబాబాకి గుడులు కట్టి, అక్కడ మా కోరికలు తీర్చమని అడిగే వాళ్ళ సంఖ్య పెంచుతున్నామే తప్ప ఒక్క గుడిలో కూడా ఎవ్వరూ 'అసలు శిరిడిసాయి ఎందుకు వచ్చాడు?' అని తెలుసుకునేందుకు ప్రయత్నించటం లేదు. పూజారులకీ అది తెలీదు. వాళ్ళు కూడా కనీసం 'నేను పనిచేస్తున్న గుడిలో నైనా సాయిని ఏమీ అడగకుండా, ఆయనకు ఏం కావాలో అడుగుదాం' అని అనుకోవటం లేదు.

## భగవంతునికే మి కావాలో అడుగు




భాగవతం భగవంతుడికి ఏం కావాలో అది అడగమని చెపుతుంది. కృష్ణుడు గీతాబోధ చిట్టచివరలో పార్థునితో - యథేచ్ఛసి తథాకురు - నువ్వేం చేయదలచుకున్నావో అది చెయ్యి అంటాడు. అప్పుడు పార్థుడు కరిష్యే వచనం తవ-- 'నేనేం





తగిన సమయములో తగిన నిర్ణయము తీసుకోకపోయినా, భయపడి వాయిదా వేసినా ఆ అవకాశం జీవితములో మళ్ళీ తిరిగి రాదు. అప్పుడు బాధపడి లాభము లేదు.

చెయ్యాలను కోవటం లేదు. నువ్వేమి చెపితే అది చేస్తాను' అన్నాడు. ఈనాడు అలాంటి దమ్మున్నవాళ్ళు ఎక్కడా కనిపించటం లేదు.

'భగవంతుడా! నాకు జీవితంలో కోరికలేం లేవు. నేను నిన్ను ఏమి అడగను. కానీ నువ్వు చెప్పిన పనిచేస్తాను' అన్న వ్యక్తి ఒక్కడూ కనిపించటం లేదు. అంటే మీరు భగవంతుణ్ణి త్యాగం చేశారన్నమాట. ఆయన్ని కోర్కెలు తీర్చమని అడగవద్దు అని నేను చెప్పటం లేదు. ఆయన్నితప్ప ఇంక ఎవరిని అడుగుతారు.


**త్వమేవ మాతా చ పితా త్వమేవ....... త్వమేవ సర్వం మమ దేవదేవా!!**

మీ కోరికలు అడిగేశాక "భగవంతుడా! నీకేం కావాలి?" అని ఎందుకడగరు? అలా అడిగినట్లయితే విదులడు ఏకనాధుడు మొదలగు భక్తుల ఇంట్లో నౌకరి పని చేసినట్లే మీ ఇంట్లో కూడా చేస్తాడు.

ఉత్తరభారతదేశంలో రామ్ రమాపతి అనే బ్యాంక్ ఉంది. అందులో రామనామాన్ని అప్పిస్తారు. ఒకసారి పేరుమోసిన చలనచిత్ర కథానాయకుడు టాడా కేసులో ఇరుక్కున్నాడు. వాళ్ళ నాన్న కేంద్ర మంత్రైయినా కూడా దాన్నుంచి



బయటపడలేకపోయాడు. అప్పుడు అతను ఈ బ్యాంక్ నుంచి రామ నామాన్ని అప్పుగా తీసుకున్నాడు. కేసు నుంచి బయటపడ్డాడు. కావున నామ మహిమ అంత గొప్పది.




ఆ బ్యాంక్ స్థాపించినాయన నా స్నేహితుడి తండ్రి. ఆయన కూతురుకి పెళ్ళి నిశ్చయమయ్యింది. ఇంక పెళ్ళి మూడురోజులుందనగా పనమ్మాయి రావడము మానేసింది. మేము పనమ్మాయిని పిలుచుకుని రావటానికి వాళ్ళ ఇంటికి వెళుతూండగా ఆ పనమ్మాయే పనికి వెళదామని బయలుదేరి మాకు ఎదురొచ్చింది. సరే పనమ్మాయి వచ్చి, పెళ్ళిలో చేయవల్సిన పనులు చేసింది. పెళ్ళి బాగా జరిగింది. పెళ్ళైన తర్వాత వాళ్ళు ఆ పనమ్మాయి సేవలకి సంతోషించి చీర ఇచ్చి కట్టుకుని దేవుడికి దణ్ణం పెట్టుకుని రమ్మన్నారు. ఆ పనమ్మాయి దేవుడికి దణ్ణం పెట్టటానికి లోపలికి వెళుతోంది. ఇంతలో వాకిట్లోంచి అచ్చుమచ్చు అలాగే ఉన్న ఇంకో పనమ్మాయి లోపలికొస్తోంది. బయట్నుంచి లోపలికొచ్చిన పనమ్మాయి ‘బాబుగారు! అమ్మాయిగారి పెళ్ళి సమయానికి నాకు వేరే పనివచ్చి ఇక్కడికి రావటం మానేశాను. నన్ను క్షమించండి’ అంది. అప్పుడాయన నువ్వు పెళ్ళికి రాకపోవ టమేమిటి? నువ్వు పెళ్ళి పనులు చాలా బాగా చేశావని చీర




పెట్టి కట్టుకు రమ్మన్నాముగా అన్నాడు. మాకెందుకో అనుమానం వచ్చి దేవుని మందిరములోకి వెళ్ళి చూస్తే అక్కడ చీర ఉంది కానీ, పనమ్మాయి మాత్రం లేదు.

అంటే అక్కడ ఏం జరిగింది? స్వయంగా సీతమ్మవారే పనమ్మాయిగా వచ్చింది. పనిచేసింది. మీకు భక్తి ఉంటే మీ ఇంట్లో కూడా భగవంతుడు ఊడిగము చేస్తాడు. అలాగని ఈపటినుంచి మీ పనమ్మాయికి దణ్ణం పెట్టకండి. ఇక్కడ భావన ముఖ్యంతప్ప కర్మ కాదు.

నానక్ ఒకసారి పండరీపురం లోని విఠలుణ్ణి దర్శనం చేసుకోవటానికి వెళతాడు. సరే గుడిలోకెళ్ళి దేవుణ్ణి దర్శనం చేసుకుంటున్నప్పుడు అక్కడ ఉత్తి విగ్రహం మాత్రమే ఉంది తప్ప విఠలుడు లేడని కనిపెట్టాడు. ఎక్కడికి వెళ్ళాడు? అని ఆలోచిస్తుంటే ప్రక్కనే ఉన్న ఇద్దరు భక్తులు దాన్ని గమనించి ఇప్పటికి ఆరేళ్ళబట్టి ఇక్కడ విఠలుడు లేడండి. మేము కూడా ఆయన ఎక్కడి కెళ్ళాడా? అని ఆలోచిస్తున్నాము అన్నారు. సరే వాళ్ళ ముగ్గురు విఠలుడు ఎక్కడున్నాడో వెదుకుదామని అనుకుంటారు.

బద్ధకస్తుడు ఆధ్యాత్మిక జగత్తులోనే
కాదు, భౌతిక జగత్తులో కూడా
రాణించలేడు.





భాగవతంలో చెప్పిన ప్రకారం దేవుడు ఎక్కడుంటాడు? నామ సంకీర్తన, భజన జరిగే చోట ఉంటాడు. మరి మీరు భజన ఎలా చేస్తారు? చేతులు కదలవు, నోరు పెగలదు. అది మీ భక్తి. ఇంక అక్కడ దేవుడేం ఉంటాడు? భజన చేయటమంటే ప్రాణయామం చెయ్యటమే. భజన దేనితో చేస్తాము? చేతులతో చేస్తాము. యోగవిద్యలో చేతులు అనాహత చక్రానికి సంబంధించిన కర్మేంద్రియాలు. ముక్కు జ్ఞానేంద్రి యము. ఆ అనాహత చక్రాన్ని జాగృతం చేయటానికి మీరు ముక్కుతోనే ప్రాణాయామము చెయ్యక్కర్లేదు. చేతులతో కూడా చెయ్యవచ్చు. భజన చేస్తూ చేతులతో లయగా చప్పట్లు కొట్టినప్పుడల్లా ప్రాణాయామమే జరుగుతూ ఉంటుంది. అప్పుడు ప్రాణం సుషుమ్న లోకి వెళ్ళి మీరు సమాధిస్థితిని పొందుతారు.

ఒక అరగంటసేపు చప్పట్లు కొట్టి చూడండి. మీ ఆరోగ్యం ఎంత బాగుపడు తుందో!! మోకాళ్ళ నొప్పు లున్నవాళ్ళు అరగంట చప్పట్లు కొడితే వాళ్ళ మోకాళ్ళ నొప్పులు పోతాయి. కానీ భజన చేయటం వలన నొప్పులు తగ్గుతాయని తెల్సినా యెవ్వఋూ భజన చెయ్యరు. ఎందుకు? మీకు ఆ రోగం పోవాలని లేదు కనుక. ఇది ఆశ్చర్యకర మైన విషయం.





మోకాళ్ళ నొప్పులు పోవాలంటే ప్రాణాయామము చెయ్యాలి. అది సరిగ్గ చెప్పే గురువులు లేరు. కానీ చప్పట్లు కొట్టటం అనేది ఎలాగైనా చేసుకోవచ్చు కనుక అది చేసుకోండి. చప్పట్లు కొట్టినప్పుడల్లా మీ సుషుమ్నా నాడి కదులుతుంది. దానితో మీ రోగాలు నయమవ్వటమే కాకుండా మీకు సమాధిస్థితి ప్రాప్తిస్తుంది. ఆ స్థితిని నిరంతరం నిలుపుకోవడానికి నిత్యమూ సాధన చేసుకోవాలి.

తప్పలు చేయటము సహజమే. అందరూ తప్పలు చేస్తారు. కానీ చేసిన తప్పని సవరించుకోకపోవటము ఇంకా పెద్ద తప్ప. ఆ తప్పని దిద్దుకున్నవాడే మనీషి అని అనిపించుకుంటాడు.




## భగవంతుని సంకల్పం

బుద్ధుడు మొదటిసారి తన రాజభవనాన్ని విడిచి విశాల ప్రపంచములోకి అడుగుపెడతాడు. జీవితంలో మొదటిసారిగా దారిలో ఒక రోగిని చూస్తాడు. అతనెవరు? అని అడుగుతాడు సారధిని. అతను రోగి అని చెబుతాడు అతను. అప్పుడు బుద్ధుడు తన రథసారధిని 'నాకు కూడా రోగం వస్తుందా?' అని అడుగుతాడు. దానికి అతను ప్రతివారికి జీవితంలో ఎప్పుడో అప్పుడు రోగము రాకుండా ఉండదు. కనుక మీకూ రోగం వస్తుందన్నాడు. ఇంకొంచెము దూరము వెళ్ళాక ఒక ముసలివాడిని చూస్తాడు. అతనెవరు? అని అడుగుతాడు గౌతముడు. 'అతను ఒక ముసలివాడు' అని అంటాడు





భారతభూమిలో దేవాలయాలు
కోరికలు తీర్చే స్థలములేకాక
ఆధ్యాత్మిక విద్యా కేంద్రములుగా
ఏర్పరచారు ఋషులు.

రథచోదకుడు. దానికి బుద్ధుడు ‘నాకూ ముసలితనం వస్తుందా?’ అని అడిగితే కచ్చితంగా వస్తుందన్నాడు రథసారథి. మరి కొంచెం దూరం వెళ్ళాక, ఒక శవాన్ని చూస్తాడు. శవాన్ని చూసిన బుద్ధుడు రధసారధి ద్వారా అది చనిపోయిన వ్యక్తి శరీరమని తెల్సుకుని అయితే ‘నేనూ చనిపోతానా!!’ అని అడుగుతాడు. నువ్వే కాదు ఎవరైనాసరే చనిపోక తప్పదు అంటాడు సారథి. వీటినుంచి ఎలా బయటపడాలి? అని అడుగుతాడు. ఆత్మజ్ఞానం పొందాలి అంటాడు సారధి.

బుద్ధుడు ఇంక ఈ భౌతిక జీవితం గురించి ఆలోచించకుండా తన లక్ష్యం ఏంటో నిర్ణయించుకుని దాన్ని సాధించటం కోసం తన రాజ్యాన్ని, తనవారిని వదిలి వెళ్ళి పోతాడు. తర్వాత బుద్ధత్వం పొందాకే రాజ్యానికి తిరిగొస్తాడు.

మనమూ రోజు ఈ మూడు చూస్తూనే ఉన్నాము. అయినా ఏ చలనమూ లేదు. అంటే మనకి చాలా ధైర్యము ఉందన్నమాట. అందుకే షేక్స్పియర్ ‘తెలివైనవాళ్ళు అడుగు పెట్టటానికి కూడా భయపడే ప్రదేశంలో మూర్ఖులు చెప్పులు వేసుకుని ధైర్యంగా



నడిచేస్తారు’ అనేవాడు. మనం అలాంటి వాళ్ళమన్నమాట. ప్రతిచోటా భగవంతుని శక్తే ఉంది. మీ శరీరంలో కూడా ఆ శక్తే ఉంది. ఆ శక్తి మీ శరీరంలో ఎప్పుడు కుంటుపడితే అప్పుడు మీకు రోగం లేక ముసలితనం లేక మృత్యువు అనేవి వస్తాయి. లోపలున్న దైవం ఒక్కసారి ఇంక చాల్లే అనుకున్నాడో మనం చనిపోతాము. కానీ మనిషి అంతా తన చేతిలోనే ఉందని అహంకరిస్తాడు.

ఈ మాటలని విన్నా, చదివినా లాభం లేదు. మీ జీవితాలలో వాటిని అన్వయించుకుని ఆచరించాలి. అప్పుడు యోగమార్గములో తప్పక ప్రగతి సాధిస్తారు.

మీకు ఒకసారి అనారోగ్యం వచ్చిందనుకోండి. వైద్యుడి దగ్గరికి వెడితే ఆయన మీ దగ్గర రెండు లక్షల రూపాయలు తీసుకుని శస్త్రచికిత్స చేసి దాన్ని తగ్గిస్తాడు. అప్పుడు మీరు ‘మీ దయవల్ల నా రోగం తగ్గింది’ అని ఆయనకి కృతజ్ఞతలు తెలియ జేస్తారు. ఆయన కూడా నావల్లే తగ్గిందని చెపుతాడు. అదే వైద్యుడు ఇంకో రోగికి మందిచ్చాడు. వాడు చనిపోయాడు. వాడు చనిపోయినప్పుడు వైద్యుడేం చెపుతాడు? నా చేతిలో ఏముందయ్యా! అంతా భగవంతుని సంకల్పం, కనుక ఇలా జరిగిందంటాడు.





యోగ్యత అనేది సాహసము మీదే
ఆధారపడి వున్నది.



రోగం తగ్గనప్పుడు అది భగవంతుని సంకల్పమైతే, మరి అది తగ్గినప్పుడు భగవంతుని సంకల్పం కాదా? ఇలాంటి సంఘటనలు జీవితంలో మీ కంటి ముందు అనేకం కనిపిస్తున్నా కూడా మీరు భగవంతుణ్ణి ఎందుకు నమ్మలేకపోతున్నారు? ఏది జరిగినా భగవంతుని సంకల్పమే అన్న భావన రావాలి మీకు. అప్పుడు బాధలు ఉన్నా, సుఖా లున్నా ఏమి ఉండదు. ఏ బాధున్నా అది మీకు భగవంతుడే ఇచ్చాడు. అలాగే సుఖము కూడా ఆయనే ఇస్తాడు. అసలు మీ భక్తి సరిగ్గా ఉంటే ఆయన మీ మధ్యనే తిరుగుతూ మీ ఇంటిలో ఊడిగం చేస్తాడు. మరి ఆయన మాకెందుకు కనిపించటం లేదండి!! మీరు చూస్తేగా కనిపించేది. ఆ చూసే దృష్టి ఎలా వస్తుందంటే శ్రవణం చేస్తే వస్తుంది. వింటే వస్తుంది. దాన్ని మహాత్ములు, భక్తులు ఎలా సాధించారో చూడండి. వాళ్ళలో ఉన్న దైవశక్తిని చూడండి. చుట్టూ ఉన్న ప్రజలలో కూడా దాన్ని గమనించండి.

**ఆధ్యాత్మిక భాషలో చెప్పే స్వేచ్ఛ అనే పదానికి అర్థము --**
**ఇష్టము వచ్చిన పనిని, ఇష్టమొచ్చిన కాలములో, ఇష్టమైన రీతిలో చేయగలుగుట.**



## గురుతత్త్వము

**అఖణ్డమణ్డలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।**

**తత్పదం దర్శితం యేనా తస్మై శ్రీగురవే నమః ॥**



ఆ శ్లోకం యొక్క అర్థ మేమిటి? గురుతత్త్వం అఖండమైనదని. పురాణాలలో సతీసుమతి మొదలగు వాళ్ళు సూర్యుడ్ని ఆగిపొమ్మంటే ఆగిపోయాడు. అవన్నీ కట్టుకథలు అనుకోకండి. అది సంభవమే. మీరూ అది చెయ్యగలరు. కానీ అది మీకు అర్థమవ్వటం లేదు. చివరికి ఇళ్ళల్లో కూడా ఇది నాది, అది నీది అని దెబ్బలాడుకుంటారు.

**బాహ్యజగత్తులో ఉన్న ఏ వ్యక్తి, ఎలాంటి పరిస్థితి నీ యొక్క ప్రణాళికాబద్ధమైన జీవితాన్ని మార్చలేదు. అసంభవము.**

‘బాబూ! ఆత్మ తప్ప ఏదీ శాశ్వతం కాదు, అది సర్వవ్యాపకమైనది’ అని దాన్ని సాధించిన గురువు అది చెప్పటాని కొస్తే ఆయనకి ఒక కుర్చీ వేసి దణ్ణం పెట్టి ఆయన్ని అక్కడే బంధిస్తే ఆయనేం చేస్తాడు? అంటే గురువుకి దణ్ణం పెట్టుకోవద్దని కాదు. కానీ గురుతత్త్వము యొక్క అఖండత్త్వము మీకు అర్థమవ్వాలి.

దణ్ణం పెట్టటంలో గల అంతరార్థ మేమిటంటే -- గురుదేవా! నువ్వు ఈ భౌతిక శరీరంలోనే కాదు. సృష్టిలోని అణువణువులో కూడా ఉన్నావు - అని దర్శించే బుద్ధి నాకియ్యి అని. గురువుని అది అడగండి. అది కీర్తించటమౌతుంది. దాన్ని అభ్యాసం చెయ్యండి. భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని అర్థము చేసుకోండి.


దానికి సాయిలాంటి మహనీయులు వాళ్ళ చిత్రపటం ఉంటే వాళ్ళున్నట్లే అని అనేకసార్లు నిరూపించారుగా! కనక అన్నిచోట్లా ఆ భగవంతుడే ఉన్నాడనే మానసిక స్థితి తెచ్చుకోండి. ఆ సంఘటనలు గుర్తుచేసుకుని వాటిగురించి చెప్పుకోవటం కీర్తనభక్తి.



ఇంక కథలోకొస్తే తుకారమ్, నానక్.. విఠలుణ్ణి వెదుక్కుంటూ వెడతారు. వాళ్ళకి ఆయన ఏకనాథుని ఇంట్లో ఊడిగం చేస్తూ కనిపించాడు. ముగ్గురూ విఠలుని కాళ్ళమీద పడతారు. తుకారమ్, నానక్ నుంచి విషయం తెల్సుకున్న ఏకనాథుడు కన్నీళ్ళతో స్వామి పాదాలు కడిగి తనని క్షమించమని అడుగుతాడు.

మీకు కనుక భక్తి ఉంటే ఒక్క విఠలుడే కాదు ఏ దైవతా శక్తైనా కూడా మీ ఇంట్లో ఊడిగం చేస్తుంది. విద్యుచ్ఛక్తి మీకు ఊడిగం చేస్తోందా? లేదా? చేస్తోంది, కానీ ఎప్పుడు? మీరు విద్యుచ్ఛక్తి యొక్క నియమాలని పాటిస్తే. లేకపోతే షాక్ కొడుతుంది. అలాగే గురువూ చేస్తాడు. కానీ ఎప్పుడు? మీరు గురుతత్త్వమును ఉపయోగించుకోవటానికి కావల్సిన నియమాలని పాటిస్తే.

**గురుర్బ్రహ్మా ర్గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః । గురుసాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీగురవే నమః ॥**




ఈ శ్లోకం అర్థమేంటి? గురువే బ్రహ్మ, విష్ణు, ఈశ్వర స్వరూపుడని. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు, కరుణామయుడు, ప్రేమమూర్తి అయిన ఆ గురువు పరబ్రహ్మరూపి. ఆయనకి భక్తితో నమస్కరించండి.





కాలం కలిసి రాలేదని అనుకోకండి.

కాలం ఎప్పుడూ ఒకేలాగ ఉంటుంది.

మనం చేసే పనిని బట్టే ఫలితాలు

మారుతూంటాయి.

అన్నిచోట్లా ఉన్న గురువు మీలోనూ ఉన్నాడు. మీలోనే ఆయన్ని చూడలేకపోతే మీకు ఆయన ఇంకెక్కడా కనిపించడు. గురువు మీలో కనిపిస్తే అన్ని చోట్లా కనిపిస్తాడు. కీర్తన భక్తంటే ఆ భగవచ్ఛక్తి ఎక్కడెక్కడ ఎలా పనిచేసి మహిమలు చూపిందో వాటి గురించి చెప్పుకోవటము. చెప్పుకుంటే భగవంతుని పట్ల మీలో విశ్వాసము, శ్రద్ధ పెరుగుతాయి.

## మానవుని స్వేచ్ఛ

బ్రహ్మ- విష్ణు- మహేశ్వర స్వరూపుడైన గురువు మానవశరీరధారులలో సర్వోత్తముడు. మొత్తం సృష్టిలో ఉన్న 14 లోకాలలో చాలా అద్భుతమైన వ్యక్తి మనిషి. ఇలాంటి మానవ శరీరం ఉన్న ప్రాణి సృష్టిలో ఇంకే గ్రహములోనూ లేదు. మానవులు కేవలం పృథ్వి మీద మాత్రమే కనిపిస్తారు వీళ్ళ గొప్పతనం ఏంటంటే -తమ జీవితాన్ని తమ చేతుల్లోకి తీసుకోగలరు. అతనికా సామర్థ్యముంది.



సింహం- సింహం లానే జీవించాలి. ఏనుగు -ఏనుగు లాగే జీవించాలి. అలాగే మిగతా ప్రాణులు కూడా. అవి తమ స్వభావాన్ని కానీ, గుణాలను కానీ మార్చుకోలేవు. జంతువులే కాదు. దేవతలు కూడా తమ స్వభావాన్ని మార్చుకోలేరు. అందుకే దేవతలకి కూడా మానవ శరీరం అంటే ఇష్టం. వాయుదేవుడు గాలి వీచాలి తప్ప నేను ఇవాళ నీళ్ళగా ప్రవర్తిస్తానంటే అప్పుడు ముక్కుల్లోంచి గాలి కాకుండా నీళ్ళు ప్రవహించి కొంపలంటుకుపోతాయి. కనుక వాయుదేవుడు వాయుదేవుడి లానే ఉండాలి. బ్రహ్మ సృష్టిస్తూనే ఉండాలి. అలాగే అందరి దేవతలూ కూడా ఎవరి పని వాళ్ళే చేస్తూండాలి.




బ్రహ్మదేవుడికి 3,11,36 000 కోట్ల కోట్ల సంవత్సరాలు ఒక సంవత్సరము. ఇలాంటివి వంద రోజులైతే తప్ప ఆయన పని పూర్తికాదు. అప్పటివరకు ఆయన సృష్టిస్తూనే ఉండాలి. అంతే తప్ప నాకు యీ సృష్టికార్యము విసుగొస్తోందనటానికి వీల్లేదు. విష్ణువు సంగతి సరేసరి. ఎప్పుడెప్పుడు అధర్మము ప్రబలినా ఆయన అవతరించాల్సిందే.


కానీ మానవ శరీరానికి ఒక విచిత్రమైన శక్తి ఉంది. అతను మాత్రం ఏ పనైనా తనకి ఇష్టముంటే చేస్తాడు లేకపోతే చెయ్యడు. దేవతలకి, జంతువులకి ఈ స్వేచ్ఛలేదు. ఆ స్వేచ్ఛ ఉన్న మనిషి భగవంతుడ్ని పొందటం కోసం కాలాన్ని సద్వినియోగం చేసుకో



కుండా -ఆహారనిద్రాభయ మైధునంచ - అంటే ఆహార విహారాలలో తన కాలాన్ని నష్టం చేసుకుంటున్నాడు. మనిషికి ఆ స్వేచ్ఛ ఉందని తెలుసు.  ఇంతతెల్సిన మనిషి ప్రవర్తన ఎలా ఉంది? పశువుల లానే ఉంది. మరలా ఉంటే ఏమౌతుంది? పశువులకి ఎలాగైతే స్వేచ్ఛలేదో మనిషి జీవితంలో కూడా స్వేచ్ఛ ఉండదు. కానీ స్వేచ్ఛ ఉండి, లేకుండా ఉండటం కష్టమేగా! ఆధ్యాత్మిక విద్యలో గురువు చెప్పేది అదే.

మేము అలా జీవించటం లేదండి. అందరి సంగతి ఎందుకు నువ్వు అలా జీవించు. ఎదుటివాడు ప్రేమిస్తేనే నేను ప్రేమిస్తానండి అంటే అది వ్యాపారమౌతుంది కానీ ప్రేమ అవ్వదుగా! ప్రేమ అనేది ఒక జ్యోతి లాంటిది. దాని వెలుతురు అందరి మీదా ఒకేలాగ పడతుంది. జ్ఞానమూ వెలుతురు పర్యాయవాచకపదాలు. మానవ జన్మ ఎత్తి ఇంత అవగాహన ఉన్న మీరు, కచ్చితంగా మిగతావాళ్ళకంటే భిన్నంగా జీవించగలగాలి. జీవించటానికి మీ దృష్టికోణం మారితేచాలు.

ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఒక అద్భుతమైన శక్తి ఉంది. దానికి- సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్ధుడు, కరుణామయుడు, ప్రేమమూర్తి అనే లక్షణాలున్నాయి. ఆ శక్తి అఖండంగా ఉన్నది అనే దృష్టికోణం తెచ్చుకోవటమే కాక దాన్ని నమ్మండి.



ఎవరో వచ్చి మిమ్మల్ని మార్చరు,
మీరే మారాలి.



ఆ శక్తి శిరిడీసాయిని కూడా శాసించింది. అందుకే ఆయన 'అల్లా మాలిక్' అనేవాడు. ఆయన ఒప్పుకోకపోతే నేనేం చెయ్యలే ననేవాడు. అలాగే వెంకయ్యస్వామి కూడా 'పైవాడు ఒప్పుకోవటం లేదయ్యా' అనేవాడు. నువ్వు కష్టపడకుండా లంచమిచ్చి నాకు పదోన్నతి కలిగించు స్వామి! అని భగవంతుణ్ణి ప్రార్థిస్తే ఆయన కష్టపడి పనిచేసిన వ్యక్తినొదిలేసి నీకు పదోన్నతి కలిగిస్తే అటువంటి భగవంతుడుండటం చాలా ప్రమాదం.

ఒక పెద్ద శాసనవ్యవస్థలో సవ్యముగా జీవించకుండా ఉండటమే కాకుండా, అర్హతలేని పరిస్థితులు కావాలని కోరుకోవటం తప్పుకాదా! కనుక మీరు గుర్తుంచు కోవల్సిన దేంటంటే -

**గురుర్బ్రహ్మ ర్గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః ।**

**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ॥**

**అఖణ్డమణ్డలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।**

**తత్పదం దర్శితం యేనా తస్మై శ్రీగురువేనమః ॥**

గురువు బ్రహ్మ లాగా సృజనాత్మకమైన శక్తి కలవాడు. బ్రహ్మ నీ నొసటన ఒక రాత రాసేస్తే ఇంక ఆయనకూడా దాన్ని ఏమి చెయ్యలేడు. కానీ నువ్వు దాన్ని గురు




ఆధ్యాత్మికత యొక్క సంపూర్ణత
గురువుల యొక్క చరిత్రలో లభిస్తుంది.



అనుగ్రహంతో మార్చుకోగలవు.  అంటే గురువేం చేయగలడు? బ్రహ్మరాతని కూడా మార్చగలడు. అలా మార్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి కదా! మీ జీవితాలలో కూడా ఎన్నిసార్లు అలాంటి మార్పులొచ్చాయేయో మీకు తెలీదు.

అలాగే విష్ణుమూర్తి చెయ్యలేని పని, ఈశ్వరుడు చెయ్యలేని పనికూడా గురువు చెయ్యగలడు. కానీ ఎప్పుడు? గురువుకి సర్వసమర్పణ చేసుకుంటే. ఆ సమర్పణ ఎలా చేసుకోవాలో భగవద్గీతలో శ్రీకృష్ణుడు 18వ అధ్యాయము 65, 66 శ్లోకములలో ఇలా చెప్పాడు.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మా మే వైష్యసి సత్యంతే ప్రతి జానే ప్రియో2సిమే ॥**
**సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

సర్వసమర్థుడు, సర్వశక్తిమంతుడు అయిన గురువు యొక్క మహిమను గురించి వినటం శ్రవణభక్తైతే, దాని గురించి చెప్పుకోవటమే కీర్తనభక్తి.



## ముగింపు

శ్రవణభక్తి ద్వారా అంటే భగవంతుని మహిమలను గురించి విని తరించిన వారు చరిత్రలో అనేకమందున్నారు.

ఉదాహరణ -- ప్రహ్లాదుడు. తల్లి గర్భములో ఉండగానే దేవర్షి నారదుని అనుగ్రహంతో విష్ణుమూర్తి గుణగణాలను, మహిమలను విన్నాడు. ఆ వినటం వల్లనే హరిని విరోధిగా భావించే రాక్షసుల జాతిలో పుట్టినా విష్ణుమూర్తి భక్తుడైనాడు. తాను భక్తుడుగా తరించటమేకాక తన మూలంగా విశ్వకళ్యాణం కోసం నరసింహావతారం ఆవిర్భావానికి కారణుడయ్యాడు. అంటే ప్రహ్లాదుడు ఉత్తిగా ఏదో కాలక్షేపం కోసం వినలేదు. ఎంత బాగా విన్నాడంటే విష్ణుమూర్తి ఒక అవతారం ధరించి స్వయంగా అతనికోసం దిగి రావల్సివచ్చింది.

మరి సాధకులందరూ భాగవతాన్ని కాదు, ఏ ఉపన్యాసాన్నైనా అలా వినగలిగితే తను తరించడమేకాక విశ్వకళ్యాణానికి హేతువు కాగలడు. అలా కావడానికి ముందు అనేకమంది భక్తుల, మహనీయుల జీవితాలలో జరిగిన అద్భుత మహిమలను గురించి వినాలి. అలా వినటమే శ్రవణ భక్తి. శ్రవణభక్తి ద్వారా భగవంతుని గాధలను, మహిమలను విన్న తర్వాత భగవంతుని మీద మరింత విశ్వాసం, నమ్మకం పెంచుకోవాలి.

దానితో భగవంతుని మీద ఇంకా భక్తి పెరుగుతుంది. దానితో అలాంటి వారితో సంబంధబాంధవ్యాలు సహజంగానే ఏర్పడతాయి. వారు సత్సంగాలను ఏర్పాటు చేసుకుని ఆ సత్సంగాలలో పరస్పరం భగవంతుని మీద తమ భావాలను పంచుకుంటారు. భగవంతుని గుణగణాలను కీర్తిస్తారు. అనేకమంది భక్తులు, మహర్షులు.......... మొదలగువారి జీవితాలలో జరిగిన సంఘటనల ద్వారా భగవంతుని అనుగ్రహం వారిపై ఎలా ప్రసరించిందో తెల్సుకుని



భగవంతుని పై ఇంకా శ్రద్ధ, భక్తి, విశ్వాసం, నమ్మకం పెంచుకుంటారు. ఆయన గుణగణాలను నోరారా కీర్తిస్తారు. అలా కీర్తన చేయటం ద్వారా భగవంతుని పొందటమే కీర్తనభక్తి. కీర్తనభక్తి ద్వారా అనేకమంది మహానుభావులు తరించారు.

ఉదాహరణ నారదుడు. నిరంతరం నారాయణ నామస్మరణతో ముల్లోకాలలో తిరుగుతూ విశ్వకళ్యాణకారకమైన పనులనే చేస్తూ ఉంటాడు. తాను చేయడమేకాదు ఇతరుల చేత కూడా చేయిస్తాడు. వారూ దానిలో పాలుపంచుకునేటట్లు చేస్తాడు. అంతేగాక సృష్టిక్రమములో రావల్సిన మార్పులకోసం(పరిణామక్రమము) దేవతలకి కూడా అందునా త్రిమూర్తులకి కూడా సహాయం చేస్తాడు.

కీర్తనభక్తి ద్వారానే నారదుడు అంత గొప్పవాడయ్యాడు. ప్రహ్లాదుడు, ధృవుడు, వాల్మీకి మొదలగు మహాభక్తులను, ఋషులను ప్రపంచానికి అందించాడు. నారదుడు ఎవరెవరికి గురువుగా మార్గదర్శనం చేశాడో, వాళ్ళందరూ ఈ అనంత కాల చరిత్రలో అజరామరంగా నిలిచిపోయారు. నారదుడే కాదు, ఈ యుగములోని త్యాగరాజు, అన్నమయ్య, కంచెర్ల గోపన్న మొదలగువారు కూడా కీర్తనభక్తి ద్వారానే తరించారని మనకందరికి తెల్సు.

నవవిధ భక్తులలో 'శ్రవణభక్తి-కీర్తనభక్తి' ల ద్వారా వాళ్ళేకాదు మనమూ తరించవచ్చు. అలాగే మిగతావైన స్మరణభక్తి, పాదసేవనభక్తి, అర్చనభక్తి, వందనభక్తి, దాస్యభక్తి, సఖ్యభక్తి, ఆత్మనివేదనభక్తి లతో కూడా అనేకమంది తరించారు. తరిస్తారు కూడా. మనమూ వాళ్ళ దారిలో పయనించి తరిద్దాము.

సర్వేజనా సుఖినోభవంతు !!

